రచన - జనవరి 2003

కథా నిలయం
5979
శ్రీకాకుళం

# ఆది రచయితలు

సాహిత్యభోజుడొకనాడు తన సాహిత్యసభాప్రాంగణంలో కొలువుతీరి ఉండగా, అద్భుతమైన ముఖవర్చస్సు కల ఓ వృద్ధవనిత ఆ సభలో ప్రవేశించింది.

భోజుడు కొద్దిగా ఆశ్చర్యపడుతూ, "అవ్వా! ఇది రాజ్యాంగ వ్యవహారాలకూ, న్యాయాన్యాయ విచారణలకూ సమయం కాదు! అయినా శ్రమించి వచ్చినందుకు నిన్ను మరల రమ్మని ఆదేశించడం భావ్యం కాదు. నీకు వచ్చిన కష్టమేమిటో చెప్పు," అన్నాడు.

అ క్షణాన సభాప్రాంగణంలో వేరు ఆసనం ఖాళీలేని కారణంగా కాళిదాసు లేచి నిల్చుని, ఆ ముదుసలి స్త్రీని తన ఆసనమునందు గౌరవమర్యాదలతో ఆసీనురాల్నిగా చేశాడు.

"రాజా! కాళిదాసు నన్ను తన ఆసనమున కూర్చోబెట్టి నీ సభామర్యాదను కాపాడినాడు! నేను వచ్చినది నీ మీద నేరారోపణకే!" అన్నదా వృద్ధవనిత.

"రాజ్యాధికారిగా నేరస్థులను శిక్షించడం మినహా, తెలిసి నేను ఎవరికీ అపచారం చెయ్యలేదు! నేను చేసిన అపరాధమేమిటో చెప్పు," అన్నాడు భోజుడు గంభీరవదనంతో.

"ఈ సాహిత్య సమావేశాలూ, గోష్ఠులూ ఈ మందిరానికే పరిమితమై పోతున్నాయి. కాళిదాసు

వ్రాసిన కావ్యాలూ, రూపకాలూ అత్యంత మనోహరాలైనా అవి సామాన్య జనుల మేధకతీతంగా ఉంటున్నాయి. ప్రజలందరూ పండితులూ కారు. దేశమంటే నీ ఒక్క రాజ్యమూ కాదు. సాహిత్యానికి ఏ విధమైన ఎల్లలూ సృష్టించకూడదు! ఏమంటావు భోజా?" అని ప్రశ్నించిందా వృద్ధవనిత.

భోజుడు భ్రుకుటి ముడిచాడు. వెనువెంటనే అతని పెదవులపై మందహాసం వెల్లివిరిసింది. సింహాసనం నుంచి లేచి దిగివచ్చి, వంగి అవ్వ కాళ్ళకి భక్తిపూర్వకంగా నమస్కరించాడు.

"కాళిదాసా! పండితులూ, పామరులూ హర్షించేవిధంగా జీవితసత్యాల్నీ, జీవనసారాన్నీ, నైతికవిలువల్నీ, సాంఘికదృక్పథాల్నీ అలంబనగా తీసుకొని, గ్రంథరచన పోటీలలో పాల్గొనవలసిందిగా దేశదేశాలకూ వర్తమానం పంపండి. నేనివ్వవలసిన ఆదేశం యిచ్చాను. ఫలితం ప్రజల అదృష్టమూ, నా అదృష్టమూ! మాతా! ఈ పోటీ జయప్రదం కావాలని ఆశీర్వదించి వెళ్ళు!" అన్నాడు భోజుడు మరోసారి ఆమెకు నమస్కరిస్తూ.

"తథాస్తు!" అని ఆ వృద్ధురాలు లేచి, సభ నుంచి నిష్క్రమించింది.

సభలో కలకలం చెలరేగింది. చాలామంది కవి పండితులు ఉత్సుకతో తమ ఆసనాల నుండి దిగ్గున లేచారు.

భోజుడు నవ్వుతూ, "లేడికి లేచిందే పరుగన్నట్టుగా మీ తాపత్రయం తెలుస్తోనే ఉంది! ఈ గ్రంథరచన పోటీలో మన ఉజ్జయినీ రాజ్యానికి చెందిన కవి పండితులెవరూ పాల్గొనడానికి వీలులేదు! ఇది రాజ్యమర్యాద కాదు. సత్సంప్రదాయం. కాళిదాసు న్యాయనిర్ణేతగా వ్యవహరిస్తాడు. మీరందరూ పోటీకి వచ్చే గ్రంథాలనన్నింటిని క్షుణ్ణంగా పరిశీలించి కాళిదాసుకు సహాయం చెయ్యండి" అని నెమ్మదిగా మందలిస్తోనే ఆజ్ఞాపించాడు.

పండితులందరూ కాస్త నిరుత్సాహపడ్డా భోజరాజు ప్రసన్నవదనాన్నీ, కాళిదాసు గాంభీర్యతనూ వీక్షించి స్థిమితపడ్డారు.

దేశదేశాలా భోజరాజు ప్రకటన కవి పండితులలో ఉత్సహాన్ని కలిగించింది. ఓరకమైన ఉన్మాదాన్ని రెచ్చగొట్టింది. నడుం బిగించి, ఘంటం చేతబట్టి తాళపత్రాల మీద రచనలకు ఉపక్రమించారు.

❁ ❁ ❁

క్రూరుడైన తన మేనమామ కంసుణ్ణి వధించి కృష్ణుడనే రాజు మధురను రాజధానిగా చేసుకొని రాజ్యపాలన చేసేవాడు. అతను బహుచతురుడు. కపటసూత్రధారి, కఠినహృదయుడు.

1) కృష్ణుడు పలు యువతులను పలురీతులుగా వివాహము చేసుకొని అష్టమహిషుల ప్రభువుగా పేరుగాంచాడు. అతడు స్త్రీ మనోహరుడు. ఈ విషయమై ప్రజలు గుసగుసలాడుకొనేవారు. కృష్ణుని రాజ్యంలో వ్యాసుడనే పండితుడు నివసించేవాడు. వ్యాసుడు మహావిద్వాంసుడు, మేధావి. ఆ కాలమునాటికి అవగాహనలో ఉన్న సమస్త విజ్ఞానాన్నీ వేదములుగా విరచించిన ఉద్దండుడు. వేదవ్యాసునిగా ప్రసిద్ధి గాంచినవాడు.

కృష్ణుడు వేదవ్యాసునికి కబురు పంపాడు. ఏకాంత సమావేశంలో వ్యాసునితో అన్నాడు.

"భోజుని ప్రకటన విన్నారు కదా, మన రాజ్యం నుంచి ఈ పోటీలో ఎవరైనా పాల్గొంటున్నారా?"

కృష్ణుడు శృంగారప్రియుడు కాని సాహిత్యప్రియుడు కాడు. అందుకని అతని రాజ్యంలో గ్రంథరచనలు చేసేవారు లేరనే చెప్పుకోవాలి. వ్యాసుడు ఈ నిజాన్ని కృష్ణుడితో చెప్పడానికి వెనుకాడాడు. ఏదో కప్పదాటుగా సమాధానమిచ్చేలోగా కృష్ణుడు, "ఈ గ్రంథ రచన పోటీలో మీరే పాల్గొనాలి! మరెవరూ మన రాజ్యం నుంచి ఘంటం పట్టకూడదు!" అన్నాడు.

వ్యాసుడోవిధంగా సమస్య నుంచి తప్పించుకొన్నా, మరోవిధంగా కాస్త సందిగ్ధంలో పడ్డాడు. తనకంటె చిన్నవాడైన కాళిదాసు న్యాయనిర్ణేతగా వ్యవహరించడమా? అయినా రాజాజ్ఞని ధిక్కారం చేయలేకనూ - సామాన్య జనులకవగాహన కాని రీతిలో వేదాలని రూపొందించాడన్న అపప్రథ తనమీదనున్న కారణం చేతనూ - ఆ అపప్రథని తొలగించు కోవడానికి రచయితగా తనకున్న సామర్థ్యాన్ని చూపే అవకాశాన్ని వదులుకోలేకనూ' - సరేనన్నాడు.

కృష్ణుడు మరో బంధం వేశాడు.

"రాజ్య ప్రజలు నా విషయమై చెవులు కొరుక్కుంటున్నారన్న వార్తలు నా కందుతున్నాయి. మీ మాటల మీద ప్రజలకు నమ్మకముంది. మీ మీద నాకు నమ్మకముంది. మీ గ్రంథంలో ముఖ్యపాత్రధారిని నేనే కావాలి! రాబోయే తరాల్లో కూడా నా పేరు శాశ్వతంగా నిలిచేటట్లు గ్రంథరచన కొనసాగించండి!" అని ఆజ్ఞాపించాడు.

వ్యాసుడు కొంత ఆందోళన చెందాడు. తను వేదాల్లో ప్రకృతి శక్తుల ప్రస్తావన చేసి ఇంద్ర, అగ్ని, వరుణ ఇత్యాది రూపకల్పనలు చేశాడే తప్ప, వ్యక్తుల్ని సృష్టించనూ లేదు, ప్రశంసించనూ లేదు. వెంటనే నిభాయించుకొని, "రాజన్న తర్వాత అధికారంతోబాటు కొన్ని సమస్యల్నీ, విమర్శల్నీ ఎదురుకోక తప్పదు! నే రచించబోయే గ్రంథంలో చాలా ప్రధాన పాత్రలుంటాయి. మీ పాత్రని సూత్రధారునిగా తీర్చిదిద్దుతాను. అంతమేరకు నాకు గ్రంథరచనలో స్వేచ్ఛ కావాలి," అన్నాడు వ్యాసుడు కాస్త ధైర్యంతో కూడిన వినమ్రతతో.

కృష్ణుడు తల పంకించి అంగీకారం తెలియజేశాడు.

వ్యాసుడు తన ఆశ్రమానికి వెళ్ళి, వినాయకుడనే శిష్యుణ్ణి వ్రాతకారునిగా నియమించుకొని, అకుంఠిత దీక్షతో మహాభారత రచనకు ఉపక్రమించాడు. కృష్ణుని అధిక్యతను తెలియజేయడానికి భాగవతాన్ని ఉపగ్రంథంగా రచించాడు.

❁ ❁ ❁

అయోధ్యని రాజధానిగా చేసుకొని రాముడనే రాజు కోసల రాజ్యాన్ని పరిపాలించేవాడు. అత్యంత సాధుస్వభావము గల రాజైనా విలువిద్యలో ఆరితేరినవాడు, స్నేహశీలి, త్యాగబుద్ధి కలవాడు, ధర్మవర్తనుడు. ప్రజాశ్రేయస్సే అతని ధ్యేయము. రాముని పట్టమహిషి మిథిల దేశపు రాజైన జనకుని కుమార్తె సీత. రాముడు ఏకపత్నీవ్రతుడు.

భోజరాజు ప్రకటన విన్న కోసల రాజు రాముడు చింతనలో పడ్డాడు. నిత్యమూ ధర్మపరిపాలన నిమిత్తమై పరిశ్రమించే రాముడు సాహిత్య, కళాపోషణల విషయంలో అశ్రద్ధ చేశాడు. వేరుమార్గం తోచక రాజగురువు వశిష్ఠుని వద్దకు వెళ్ళి, కోసల రాజ్యం పరువు కాపాడమని అర్థించాడు. వశిష్ఠుడు రామునికి అభయమిచ్చి పంపి, నిత్యయాత్రాసక్తుడైన నారదుడనే స్నేహితుడితో మంతనాలాడాడు.

కోసల రాజ్యంలోని ఓ అరణ్యంలో వాల్మీకుడనే ఓ బోయమనిషి ఉండేవాడు. ఈతనిని హింసామార్గం నుండి తప్పించి, సాధుమార్గంలో ప్రవేశపెట్టిన సజ్జనుల్లో వశిష్ఠుడొకడు.

నారదుడు వశిష్ఠుని తరపున వాల్మీకి ఆశ్రమానికి వెళ్ళి, "రాముడు ధర్మప్రభువు. ఉజ్జయిని రాజు భోజుడు ప్రకటించిన గ్రంథరచన పోటీలో కోసల రాజ్యం నుంచి ఎవరూ లేరన్న విచారంలో మునిగి ఉన్నాడు, కోసల రాజ్య కీర్తి చిరస్థాయిగా ఉండేటట్లు ఓ గ్రంథాన్ని రచించి ప్రభువు రాముని ఋణాన్నీ, గురువు వశిష్ఠుని మాటనీ చెల్లించు," అని ఆదేశమిచ్చాడు.

ప్రభుభక్తి పరాయణుడైన వాల్మీకి రాముణ్ణే నాయకుడిగా తీసుకొని రామాయణ రచనకు ఉపక్రమించాడు.

❁ ❁ ❁

గడువు సమయానికి ముందుగానే దగ్గర రాజ్యాల నుంచి వృషభ వాహనాల మీదా, దూరదేశాలనుంచి అశ్వశకటాల మీదా అసంఖ్యాకమైన తాళపత్ర గ్రంథాలు ఉజ్జయినిలోని భోజరాజు సాహిత్య మందిరానికి చేరనారంభించాయి. భోజుని రాజ్యంలో ఉన్న కవిపండితులందరూ శ్రద్ధాసక్తులతో గ్రంథ పరిశీలనలో నిమగ్నమయ్యారు. వడపోతల మీద వడపోతలు – కాళిదాసుతో పునః పునః చర్చలు జరిగాయి.

విసుగూ, విరామం లేకుండా జరిగిన ఈ పరిశీలనలో చివరికి నిలిచినవి రెండే రెండు గ్రంథాలు – వాల్మీకి విరచితమైన 'రామాయణం', వ్యాస విరచితమైన 'భారతం'. కాళిదాసు రెండు గ్రంథాలనూ ప్రతి వాక్యమూ, ప్రతి పదమూ, ప్రతి అక్షరాన్నీ విడువకుండా పఠనం చేశాడు.

❁ ❁ ❁

పుత్రకామేష్టియాగం చేసిన కోసల దేశపు రాజు దశరథుడు రామ, లక్ష్మణ, భరత, శత్రుఘ్నులను – తన ముగ్గురు దేవేరుల ద్వారా సంతానంగా పొందాడు. దశరథ తనయులు వశిష్ఠుని వద్ద విద్య నభ్యసించి, విశ్వామిత్రుని వద్ద ధనుర్విద్యలు నేర్చుకున్నారు. రామలక్ష్మణులు విశ్వామిత్రుడు చేసిన యజ్ఞాన్ని తాటకీ తనయులైన మారీచ సుబాహువులనే రాక్షసులు కురిపించే రక్త, మాంస వర్షపు బారి నుండి రక్షించడానికి అంత ఎత్తు ఆకాశంలో శరముల ఛత్రాన్ని నిర్మించారు. సీతా స్వయంవరంలో శివధనుర్భంగం చేసి, రాముడు సీతను పరిణయమాడాడు.

విమాత కైక కిచ్చిన వాగ్దానానికి బంధితుడైన తండ్రి దశరథుని ఆజ్ఞ శిరసావహించి, రాజ్యాన్ని త్యజించి, పధ్నాలుగు సంవత్సరాలు వనవాసం చేసేందుకు సీతాలక్ష్మణులతో సహా

అరణ్య ప్రవేశం చేశాడు. లక్ష్మణుని చేతిలో భంగపాటు చెందిన సోదరి శూర్పణఖ రెచ్చగొట్టడంతో వివేకం నశించి, శివభక్త పరాయణుడూ, లంకాధీశుడూ అయిన రావణుడు సాధువు రూపంలో వెళ్ళి, మాయలేడి వెంటబడిన రాముని ఆర్తనాదం విన్న లక్ష్మణుడు సీతని ఒంటరిగా ఆశ్రమంలో వదిలి వెళ్ళిన తరుణంలో, ఏకాకిగా ఉన్న సీతని భిక్ష కోసమై అర్థించాడు. లక్ష్మణ రేఖ దాటి భిక్ష వేయబోయిన సీత నపహరించి, ఆమెను తన లంకా రాజ్యంలోని అశోకవనంలో బంధించి, తన్ను వివాహమాడమని కోరి, ఆమె అమోదం కోసం ఎదురు చూడసాగాడు రావణుడు.

రాముడు వాలిని వధించి, సుగ్రీవుని మైత్రి పొంది, అంజనేయుని ద్వారా లంకలోని సీత ఉనికిని తెలుసుకొని, సాగరం మీద వానరసేన సహాయంతో వారధి నిర్మించి, లంకలో ప్రవేశించి, రావణుని సంగ్రామంలో హతమార్చి, సీతను చెరనుండి విముక్తి చేసుకొన్నాడు.

రామాయణం రాముని యొక్క అత్యున్నతమైన వ్యక్తిత్వానికీ, ధర్మనిరతికీ దర్పణం. అతని ప్రవర్తనారీతులు ప్రజలకు ఆదర్శమార్గాన్ని చూపుతాయి.

కాళిదాసు మనసులో ఓ చిన్న సందేహం మొలకెత్తింది. రాముని వ్యక్తిత్వంలో ఓ చిన్న అపశ్రుతి గోచరించింది. సుగ్రీవ మైత్రి కోసం వాలిని వెనుక నుంచి దెబ్బతీశాడు. రావణ సోదరుడు విభీషణుని సలహా మేరకు, రావణుని నాభికి గురిపెట్టి బాణం వదిలి సంహరించాడు. వీటిని మించి, సీతను అగ్నిపరీక్ష చేసి స్వీకరించాడు.

❁ ❁ ❁

తన తండ్రి శంతనుడు ప్రేమించిన సత్యవతి తండ్రి దాసరాజు అభీష్టప్రకారం, రాజ్యాధికారానికి అర్హుడైన గంగాపుత్రుడు రాజ్యత్యాగం చెయ్యడమే కాకుండా, బ్రహ్మచారిగా ఉండిపోవడానికి కూడా ప్రతిజ్ఞ చేశాడు. ఆ భీషణమైన ప్రతిజ్ఞ చేసి భీష్ముడిగా పేరొందాడు. విమాత సత్యవతి పుత్రులు చిత్రాంగదుడు, విచిత్రవీర్యుడు. చిత్రాంగదుడు ఓ గంధర్వునితో చేసిన యుద్ధంలో మరణించాడు.

భీష్ముడు కాశీరాజుని ఓడించి అతని ముప్పురు తనయలూ అయిన అంబ, అంబికా, అంబాలికలను హస్తినాపురికి తరలించాడు. భీష్ముని చేత నిరాకరింపబడిన అంబ ప్రతినపట్టి అడవుల్లో ప్రవేశించింది. అంబికా, అంబాలికలకు విచిత్రవీర్యునితో వివాహం జరిపిస్తాడు భీష్ముడు. స్త్రీలోలుడైన విచిత్రవీర్యుడు సంతాన రహితంగా మరణించాడు. సత్యవతి తనకు శంతనునితో వివాహపూర్వము పరాశరముని సాంగత్యంతో పుట్టిన వ్యాసుని అర్థించి, దేవరన్యాయంగా అంబికా, అంబాలికాలను అతనితో పొందుకోసం పంపిస్తుంది. వ్యాసుని అనుగ్రహం వలన వారు సంతానాన్ని పొందినా, అంబిక కుమారుడు ధృతరాష్ట్రుడు అంధుడుగానూ, అంబాలిక కుమారుడు పాండురాజు పాండురోగగ్రస్తుడుగానూ జన్మించారు. ఈ ప్రయత్నంలో చిన్న రాణుల ఆజ్ఞ మేరకు చిక్కుకుపోయిన ఓ పరిచారిక వ్యాసానుగ్రహం వలన విదురుణ్ణి కంటుంది.

అగ్రజుడు ధృతరాష్ట్రుడు అంధుడు కాబట్టి, పెద్దల ఆజ్ఞ మేరకు పాండురాజు రాజ్యపాలనా

వ్యవహారాలు చూడసాగాడు. శాపగ్రస్తుడైన పాండురాజు భార్యలైన కుంతీ, మాద్రిలతో సంసారం చెయ్యలేకపోయాడు. సంసారం చేస్తే అతని శిరస్సు వ్రక్కలయి మరణించే శాపమది. కుంతీ, మాద్రులు భర్త అనుమతితో - కుంతికి దూర్వాసుడు ప్రసాదించిన వరమహిమతో దేవతల నాహ్వానించి, వారి అనుగ్రహంతో సంతానాన్ని పొందారు. యముడూ, వాయు దేవుడూ, ఇంద్రుల అనుగ్రహం వలన జన్మించిన కుంతీ పుత్రులు ధర్మరాజు, భీముడు, అర్జునులు, అశ్వినీదేవతల అనుగ్రహం వలన జన్మించిన మాద్రీ పుత్రులు నకుల, సహదేవులు.

ఒకసారి మోహం ఆపుకోలేని పాండురాజు తన చిన్న భార్య మాద్రితో కలుస్తాడు. అతనికి మరణం సంభవించడంతో మాద్రి కూడా సహగమనం చేస్తుంది. వివాహ పూర్వము దూర్వాస మహాముని ప్రసాదించిన వరాన్ని పరీక్ష చేయబోయి, కుంతి సూర్యానుగ్రహం వలన కర్ణుణ్ణి కన్నది. ఇది చివరి వరకూ ఓ రహస్యంగానే ఉండిపోతుంది.

కుంతి ఆప్తబంధువు శ్రీకృష్ణుడు, పాండవ పక్షపాతి, అర్జునుడంటే ప్రత్యేకమైన అభిమానం.

భర్త ధృతరాష్ట్రుడు అంధుడు కావడం మూలాన గాంధారి కూడా కళ్ళకు గంతలు కట్టుకొని సాహచర్యం చేసింది. గర్భవతి అయిన గాంధారి ఒకే కానుపులో నూరుమంది కౌరవ సోదరులకూ, ఒక పుత్రికకూ జన్మనిచ్చింది. అగ్రజుడు దుర్యోధనుడు, గాంధారి సోదరుడు శకుని.

కురుపాండవులందరూ ద్రోణాచార్యుని వద్ద అస్త్రశస్త్ర విద్యలన్నీ నేర్చారు. పాండురాజు మరణంతో రాజ్యాధికారం ఎవరికి దక్కాలా అన్న వివాదం చెలరేగింది. ఈ ప్రయత్నంలో మేనమామ శకుని సలహాలతో దుర్యోధనుడు పాండవులకనేకమైన కష్టాలు కలిగించాడు. కర్ణుడు దుర్యోధనునికి ఆప్తమిత్రుడైనాడు.

అర్జునుడు, స్వయంవరంలో మత్స్యయంత్రాన్ని తన విలువిద్యా నైపుణ్యంతో ఛేదించి ద్రౌపదిని గెలుచుకొన్నాడు. తల్లి కుంతి తొందరపాటు మూలాన, ఆమె మాట మేరకు పాండవులయిదుగురూ ద్రౌపదిని వివాహమాడవలసివచ్చింది.

శకుని మాయాజూదంలో ఓడిన ధర్మరాజు సోదరులతో సహా నిస్సహాయుడై చూస్తుండగా, దుర్యోధనుని ఆజ్ఞ మేరకు అతని సోదరుడు దుశ్శాసనుడు నిండుకొలువులో ద్రౌపది మీద అత్యాచారం చేయప్రయత్నిస్తాడు. శ్రీకృష్ణుడు అఖండ వస్త్రప్రదానం చేసి ద్రౌపది మానసంరక్షణ కావిస్తాడు.

ఒప్పందం ప్రకారం పాండవులు పన్నెండు సంవత్సరాలు అరణ్యవాసమూ, విరాటరాజు కొలువులో ఒక సంవత్సరం అజ్ఞాతవాసమూ చేస్తారు. ఈ సమయంలోనే భీమార్జునులు అనేకమైన సాహసకృత్యాలు చేస్తారు. అగ్ని ఖాండవవనాన్ని దహిస్తోంటే, ఇంద్రాజ్ఞ ప్రకారం వరుణుడు కురిపించే వర్షాన్ని అర్జునుడు శస్త్రాలతో ఛత్రాన్ని నిర్మించి, అడ్డుకొని తన నైపుణ్యాన్ని ప్రదర్శిస్తాడు. ఉత్తర గోగ్రహణ యుద్ధంతో విరాటరాజు కొలువులోని అజ్ఞాతవాసం ముగుస్తుంది.

సంజయ, శ్రీకృష్ణ రాయబారాలు విఫలమైన తర్వాత కురుక్షేత్ర మహాసంగ్రామం పద్దెనిమిది

రోజులపాటు జరిగింది. ఆ యుద్ధంలో కౌరవ సోదరులతో సహా భీష్మ, ద్రోణాదులందరూ కూడా హతమయ్యారు. ఇరుపక్షాలా విపరీతమైన జన నష్టం కలిగింది. ధర్మరాజు విరక్తితో రాజ్యాధికారం స్వీకరిస్తాడు.

మహాభారతం ఓ సంఘాన్నీ, ఓ వ్యవస్థనీ, రాజనీతినీ, రణనీతినీ విభిన్న కోణాల్లో పరిశీలించే గ్రంథం. అయితే అర్జున పక్షపాతి అయిన ద్రోణుడు ఏకలవ్యుని బొటనవ్రేలు గురుదక్షిణగా అడగడం కాళిదాసుకి రుచించలేదు.

❁ ❁ ❁

కాళిదాసు పైన చెప్పిన రీతిగా భోజరాజుకి క్లుప్తంగా రామాయణ, మహాభారతాల కథాసారాంశాన్ని చెప్పాడు. తన ఆలోచనల్ని భోజరాజు ముందుంచాడు. భోజుడు రాజ్యాంగ వ్యవహారాల్ని మంత్రుల కప్పగించి, కాళిదాసుతో కూర్చుని రెండు నెలలకుపైగా రెండు గ్రంథాలనీ నిశితంగా పరిశీలించాడు.

"రెండు గ్రంథాల్లోనూ చాలా సన్నివేశాల్లో సన్నిహితత్వం కనబడ్తోంది. వాలినీ, రావణునీ వధించిన రీతితోను, కురుక్షేత్ర సంగ్రామంలో కౌరవ యోధుల్ని కృష్ణుని ఆదేశం మేరకు పాండవులు వధించిన విధానంతోను – యుద్ధంలో విజయప్రాప్తి కోసం దుష్టసంహారాన్నీ, శత్రుసంహారాన్నీ చేస్తున్నప్పుడు న్యాయన్యాయ విచక్షణ ఉండకూడదని వాల్మీకి, వ్యాసులిద్దరూ చెబుతున్నారు. తమ రాణి మహాసాధ్వి అని ప్రజలు గ్రహించడానికే సీతకి అగ్నిపరీక్ష జరిగింది కానీ రాముడు అనుమానపడి కాదు. ఆశ్రిత పక్షపాతం ఎంతటి పనినైనా చేయిస్తుందని ఏకలవ్యుని ఉదంతం చెబ్తోంది. ద్రోణుడూ, పరశురాముడూ, నిజం తెలిసిన కృష్ణుడూ కూడా కర్ణునికి అన్యాయమే చేశారు. ఆఖరికి కన్నతల్లి కుంతి కూడా కర్ణునికి అన్యాయమే చేసింది. ఇదీ ఆశ్రిత పక్షపాతానికి నిదర్శనమే.

"పర్యవసానం ఆలోచించకుండా కుంతి యథాలాపంగా అన్న మాటల వల్ల అర్జునునికీ, ద్రౌపదికీ కూడా అన్యాయమే జరిగింది. పితృవాక్య పరిపాలనలో భీష్ముడూ, రాముడూ ఎంతటి త్యాగం చేశారో, మాతృవాక్య శిరసావహనలో అర్జునుడూ అంతే త్యాగం చేశాడు. రామాయణంలో మంథర కైకనీ, భారతంలో శకుని దుర్యోధనుణ్ణీ రెచ్చగొట్టకపోతే కథలేవిధంగా మలుపు తిరిగేవో ఊహించడం కష్టం. ఆశ్రితుల చెడు సలహాలు ఎంతటి అనర్థాలకు దారితీస్తాయో అన్న సత్యం మనకు గోచరిస్తుంది. ఏది ఏమైనా చివరికి శిష్టరక్షణా, దుష్టశిక్షణా జరగకమానదనీ, ఇది కూడా దైవసంకల్పమేననీ ఓ భావన కలగకమానదు. ఈ రెండు గ్రంథాలూ ఎంతో జనరంజక మవుతాయనడంలో సందేహం లేదు" అన్నాడు భోజుడు.

"భోజరాజా, రెండూ ఉద్గ్రంథాలే! ప్రథమ, ద్వితీయ బహుమతుల నెలా నిర్ణయించాలో నాకు తోచట్లేదు!" అన్నాడు కాళిదాసు.

"కాళిదాసా! ఏకారణంవల్లనో వాల్మీకి వ్యాసులిద్దరూ తమ ప్రభువుల్ని పాత్రల్లో రూపొందించారు. బహుమతి నిర్ణయంలో ఇదొక సమస్యగా కానవస్తోంది. రామాయణం

గొప్పదంటే రాముడు ఖ్యాతి పొందుతాడు. భారతం ఉత్తమమంటే కృష్ణుడు గొప్పవాడవుతాడు. ఈ రెండో నిర్ణయం కనుక చేస్తే సాధుస్వభావుడైన రాముడు మౌనంగా ఉండిపోతాడు కానీ, మొదటి నిర్ణయమే కనుక చేస్తే కృష్ణుడేవిధంగా స్పందిస్తాడో ఊహించడం కష్టం. వేదవ్యాసుని పరిస్థితి ఇరకాటంలో పడవచ్చు. ఊహాతీతమైన రాజకీయ స్పర్ధలకు దారితీయవచ్చు. ఈ బహుమతి నిర్ణయం రాజకీయంగా మారడానికి ఆస్కారముంది. కాబట్టి, మనం ఆచితూచి అడుగువెయ్యాలి. సరే, ఈ రాత్రికి గ్రంథపరంగా మీ పండితులందరూ మరోసారి ఆలోచించండి" అన్నాడు భోజుడు.

ఆ రాత్రి ఉజ్జయినీ పండింతులందరూ వాదోపవాదాలలో మునిగితేలుతున్న సమయంలో కాళిదాసు మెల్లగా లేచి కాళీ మందిరానికి దారితీసాడు. కాళీమాతను స్మరిస్తూ ధ్యానంలోకి వెళ్ళిపోయాడు. కాళీమాత ఆదేశానుసారం భవిష్యత్కాలంలోకి పయనించి, తనలాగే కాళీవరప్రసాదుడైన తెనాలి రామకృష్ణుని కలిశాడు.

"భోజుని ఆలోచన రాజకీయంగా సవ్యమైనదే! రాముడూ, కృష్ణుడూ యిద్దరూ అవతార పురుషులుగా చిత్రీకరించబడ్డారు. నా పేరు రామకృష్ణునిగా పెట్టుకొన్న దాకారణం వల్లనే!" అన్నాడు తెనాలి రామకృష్ణుడు లౌక్యంగా తప్పించుకొంటూ.

రామాయణ భారతార్థాలు ప్రతి పద్యంలోనూ దర్శనమిచ్చే అద్భుతమైన రీతిలో పింగళి సూరనార్యుడూ, భీమేశ్వర భక్తుడు వేములవాడ భీమకవీ వేర్వేరుగా రచియించిన రాఘవ పాండవీయమనే కావ్యాలు కాళిదాసు కంటబడ్డాయి. రాజాస్థానపు గ్రంథాలలో సూరనార్యుని కావ్యాన్నీ, భీమకవి ఇంట ఆయన కావ్యాన్నీ కాళిదాసు పఠనం చేశాడు. భీమకవి తన తాళపత్రగ్రంథాన్ని కాళిదాసుకు సమర్పించుకొన్నాడు. (2)

కాళిదాసు ధ్యానంలోంచి మేల్కొని, ఉదయం కాగానే భోజరాజుని దర్శించుకొని, రాఘవ పాండవీయాన్ని గురించి విశదంగా చెప్పాడు.

భోజుడు కాళిదాసు చెప్పింది విని, "భావితరంలోని తెలుగు కవులు ఇంతటి అద్భుతమైన ప్రయోగం ఎందుకు చేశారంటే, ఈ రెండు గ్రంథాలూ ఉత్కృష్టమైనవి కావటం మూలానే! అందుచేత బహుమతి ధనాన్ని అధికం చేసి, ఇరువురు రచయితలకూ సమానంగా బహుమతిని ప్రదానం చేస్తే శ్రేయస్కరంగా ఉంటుంది. వాల్మీకికీ, వ్యాసునికీ అభినందనలు తెలియజేయమని రామునికీ, కృష్ణునికీ సందేశాలు పంపుతూ, వారిని కూడా తీసుకురమ్మనమని ఆహ్వానాలు పంపుదాం," అన్నాడు భోజుడు.

కాళిదాసు ఓ దీర్ఘ నిశ్వాసం విడిచాడు.

నిర్ణయం కృష్ణునికంత సంతృప్తికరంగా లేకపోయినా, చిరునవ్వుతో బహుమతి ప్రదానోత్సవంలో రామునితోబాటు పాల్గొన్నాడు. వాల్మీకి, వ్యాసులిరువుర్నీ భోజుడు ఘనంగా సత్కరించి, కృష్ణునిచేత వాల్మీకికి, రామునిచేత వ్యాసునికీ బహుమతి ప్రదానం చేయించాడు. కాళిదాసు గ్రంథాల పరిచయం చేశాడు. ఈ పోటీలకు కారణమైన వృద్ధవనిత వాల్మీకి, వ్యాసుల్ని

'మీ గ్రంథాలు ఆచంద్రతారార్కంగా ఉంటాయని దీవించి భోజరాజుని ప్రశంసించి సెలవు తీసుకొంది. భోజరాజు చేత ఘనమైన అతిథిసత్కారాలు పొందిన రాముడూ, కృష్ణుడూ భోజరాజునీ, కాళిదాసునీ తమ తమ రాజ్యాలకు రమ్మనమని అహ్వానించి, ఉజ్జయిని నుంచి వీడ్కోలు తీసుకొన్నారు.

కాళిదాసు వాల్మీకి, వ్యాసులకు శ్రద్ధాభక్తులతో నమస్కరించి సాగనంపాడు.

**ఉపసంహారం :**

దేవలోకం నుంచి దేవతలూ, పాతాళ లోకం నుంచి రాక్షసులూ భూలోకానికి స్వేచ్ఛగా రాకపోకలు సాగించిన కాలాన్ని పురాణయుగమనుకుంటే రామాయణ, మహాభారతాలు ఆ కాలంలో జరిగిఉంటాయని అనుకోవడంలో అనర్థమేమీ లేదు కానీ, రామాయణ, మహాభారతాలు రెండు వేర్వేరు కాలాల్లో ఆయా జీవనవిధానాల్నీ, విలువల్నీ ప్రతిబింపజేస్తూ వాల్మీకి, వ్యాసులనే రచయితలు రచియించిన విషయాన్ని మనం వాస్తవంగా తీసుకోవాలి.

'త్రేతాయుగంలో జరిగిందని చెప్పబడే రామాయణానికీ, ద్వాపర యుగాంతంలో జరిగిందని చెప్పబడే మహాభారతానికీ మధ్యనున్న కాలమెంత?' అనే ప్రశ్నకు సమాధానం చెప్పగలవారున్నారో లేదో తెలియదు కాని, పంచాంగాల్లో తెలిపే యుగ ప్రమాణాలు గణనలోకి తీసుకొంటే లక్షల సంవత్సరాల కాలం రామాయణ, మహాభారతాల మధ్య దొర్లింది. (3) ఈ రెండు గ్రంథాలలో ఉన్న సంఘటనల తీరు పరిశీలిస్తే, అవి దరిదాపుల్లో కొన్ని శతాబ్దాలూ, లేదా ఓసహస్రాబ్ది వ్యవధిలో రచించబడి ఉంటాయన్న ఆలోచన అపసవ్యం కాదు. రామాయణ కాలం (రచనాకాలం?) క్రీ.పూ.2500, మహాభారతకాలం (రచనాకాలం?) క్రీ.పూ.1500గా కొన్ని ఆధారాలున్నాయంటున్నారు చరిత్రకారులు. ఉపనిషత్తుల రచనాకాలం క్రీ.పూ.1000 నుండి 300 దాక ఉందంటున్నారు. అయితే క్రీ.పూ.550 నిశ్చితంగా బుద్ధుని కాలం. బుద్ధుడు ఆ కాలంలో జీవించిన వ్యక్తి. క్రీ.పూ.1000కి వెనుకకు పోయినకొద్దీ చరిత్ర మసకబారి పోతుంది. హరప్పా – మొహెంజదారో త్రవ్వకాల పరిశోధనల మూలంగా సింధు నాగరికత క్రీ.పూ.4000 – 3500 కాలంలో విస్తరించిందని అనుకొన్నా, దీనికి అద్యులైన ఆర్యులు మధ్య ఆసియా ప్రాంతం నుంచి క్రీ.పూ.5000 ప్రాంతంలో భారతదేశానికి వలస వచ్చిఉంటారు. వేదాలు ఆర్య సంస్కృతిలో భాగాలే కనుక సంస్కృత భాషా పరిణామమూ, సాహిత్యాభివృద్ధి, క్రీ.పూ.4000 – 3000లలో కానీ, తరువాత కాలంలో కాని జరిగిన పురాణరచనల వల్లే జరిగిఉండాలి. కాని పక్షంలో గంగా, యమునా, సింధు నదుల ప్రస్తావన వేదాలలో ఉండేది కాదు.

రామాయణ, మహాభారతాలు నిజంగా జరిగిన పక్షంలో – వాల్మీకీ, వ్యాసులు చరిత్రకారులే కాని రచయితలు కారు. అవి కేవలం కల్పితమైన మహాగ్రంథాలే అనుకొంటే వారిరువురూ రచయితలే కాని చరిత్రకారులు కారు.

అయితే వాల్మీకీ, వ్యాసులిద్దరూ చరిత్ర సృష్టించిన రచయితలు. ఈ రెండు మహాగ్రంథాలూ భారత సాహిత్య చరిత్రలో ఎన్నో కాలాలలో, ఎందరో కవులచే ఎన్నో దేశభాషలలోకి

అనువదించబడ్డాయి. అందుకనే అవి ఈనాటికీ సజీవంగానే ఉన్నాయి.

ఈ అధునిక యుగంలో కూడా, దూరదర్శన్ రామాయణ, భారతాల్ని ప్రసారం చేసే సమయాల్లో జనజీవనం స్తంభించి పోయిందంటే, వాటి రచయితలైన వాల్మీకీ, వేదవ్యాసులు ఎంతటి ప్రజ్ఞ కల రచయితలో, ఎంతటి సాహిత్య దురంధరులో మనం గుర్తించాలి. రాజాజీ ఇంగ్లీషు రామాయణ, భారతాలు యింతవరకూ పది లక్షల ప్రతులు ముద్రితమయినాయి.

మరొక విశేషమేమంటే - చారిత్రాకాధారం కొద్దిపాటిది కానీయండి, లేదా పూర్తిగా ఊహించి కల్పించిన పాత్రలు కానీయండి, రామాయణంలో రామాంజనేయుళ్ళూ, భారతభాగవతాల్లోని శ్రీకృష్ణుడూ దైవాల రూపాలు సంతరించుకొని, అశేష భారత ప్రజానీకానికి ఆరాధ్య దైవాలయినారు! రాముడూ, కృష్ణుడూ రాజులా, అవతార పురుషులా, కేవలం రామాయణ, భారతాల్లోని పాత్రలా అన్నమాట అటుంచినా, వాల్మీకీ, వేదవ్యాసులు నేటికీ ప్రజల హృదయాల్లో చిరంజీవులుగా జీవిస్తున్న ఆది రచయితలు.

✿ ✿ ✿

సూచన: (1) రాజాజీ ఇంగ్లీషు భారతంలో కృష్ణుణ్ణి నియంతగా పేర్కొన్నారు.

(2) వేములవాడ భీమకవి 'రాఘవ పాండవీయా'న్ని వ్రాసిన సంగతి నిజమే అయినా, ఆ ప్రతి లభ్యంలో లేదన్న సంగతి, అమలాపురం కాలేజీ ఓరియంటల్ లాంగ్వేజెస్ ప్రొఫెసర్ శ్రీవాడవల్లి చక్రపాణిరావుగారు తెలియజేశారు.

(3) కలియుగం 4,32,000 - ద్వాపర యుగం 8,64,000 - త్రేతాయుగం - 12,96,000 కృతయుగం - 17,28,000 సంవత్సరాలనీ పంచాంగాలు చెబుతున్నాయి మరి.

✿ ✿ ✿

ఆగండి, నాకింకా కొన్ని అస్తవ్యస్తమైన ఆలోచనలు కలుగుతున్నాయి - సాయిబాబా 19-20 శతాబ్దాలలో జీవించిన వ్యక్తి. ఆయన కిప్పుడు దేశంలో వేలాది మందిరాలున్నాయి. నిర్ధారితమైన సాయి జీవిత చరిత్ర మరో వెయ్యి సంవత్సరాల తర్వాత సాయి పురాణంగా మారడానికి అవకాశం లేదంటారా? - గాంధీ, అంబేద్కర్, పటేల్, వివేకానందుడు వంటి మహాపురుషు లందరూ ఇటీవలి వారే. నాలుగు దార్ల కూడలిలో నిలువెత్తు విగ్రహాలూ, అక్కడక్కడా స్మారక మందిరాలూ తప్ప దేవాలయాలలో వీరి విగ్రహాల్ని ప్రతిష్ఠించలేదు - తమిళనాడులో సజీవులైన ఓ సినీతారకు ఆలయ నిర్మాణం జరిగింది. కొన్ని శతాబ్దాల తర్వాత ఏ స్థలపురాణం ఈ ఉదంతాల చుట్టూ అల్లుకొంటుంది? దేవాలయ నిర్మాణం దైవాల ఉనికికి త్కారణమా? - దశావతారాల్లోని అన్ని అవతారాలకూ పురాణాలున్నట్లు దేవాలయాలు ఉన్నాయా? ఉన్నా, రామాలయాలు, కృష్ణాలయాలు ఉన్నంత సంఖ్యలో ఉన్నాయా? రాముడికి, కృష్ణుడికి ఇన్ని దేవాలయాలుండడానికి కారణం రామాయణ, మహాభారతాలంటే ఒప్పుకోక తప్పదు. అందుకే వాటి రచయితలైన వాల్మీకి, వ్యాసులు చాలా చాలా ప్రతిభావంతులు. ✿

*(రామాయణ, భారతాంశాలు మినహా మిగిలిదంతా కల్పితం - రచయిత)*